

కథ 2001
5

# సాలభంజిక

## కుప్పిలి పద్మ

ఎరైవల్స్ లాంజ్‌లో పల్చగా జనం. ఢిల్లీ నుంచి ఫ్లైట్ వచ్చే రాత్రివేళ. చాలాసార్లు వాళ్లని రిసీవ్ చేసుకోవడానికి వచ్చేవాళ్లు తక్కువే ఉంటారు. ముంబై ఫ్లైట్ అయితే ఏ వేళప్పుడైనా లాంజ్ కిటకిటలాడుతుంటుంది.

విదేశీ విమాన ప్రయాణాలకి ముంబై చాలా దగ్గర, కనక్టింగ్ లింక్. బయట డ్రైవర్లు తమ యజమానుల కోసం ఎదురుచూస్తున్నారు. వో జంట ఎక్వేరియం దగ్గర నిలబడి పాపకి చేపల్ని చూపిస్తున్నారు. రంగు రంగుల బుజ్జిబుజ్జి చేపపిల్లలు- అదేపనిగా ఈదుతూ. పూల బొకేల దుకాణంలో అమ్మాయి పూలపై నీళ్లని స్ప్రే చేస్తోంది. టాటా ఎస్.టి.డి.బూత్ లోని కుర్రాడు ఎవరితోనో కబుర్లు చెబుతున్నాడు. కెఫె దగ్గర వొకరిద్దరు నిలబడి కోక్ తాగుతున్నారు. అక్కడో ఇద్దరు ఇక్కడో ఇద్దరు కబుర్లు చెప్పుకుంటున్నారు.

చూపులకి అతి సాధారణ దృశ్యాలివి.

ఇవి యేవీ ఆమె చూపులకి ఆసక్తిని కలిగించటం లేదు. మానిటర్ వైపు చూసింది. ఫ్లైట్ పది నిమిషాలు లేట్. మానిటర్ వైపు నుంచి తిరిగి చూపుల ప్రదక్షణ.

కోరా రంగుకి నలుపు, ఆకుపచ్చ, ఎరుపు ప్రింట్ బార్డరున్న పోచంపల్లి చీర. నలుపు, ఎరుపు, ఆకుపచ్చ కలగలిసిన డిజైన్ వున్న జాకెట్టు. మష్‌రూం హెయిర్ కట్. చిన్ని మెరూన్ బొట్టు. ఐలైనర్. బ్రౌన్ మెరూన్ షేడ్‌తో లిప్‌స్టిక్. ఇరవైరెండో మూడో వయస్సున్న అమ్మాయి. పద్దెనిమిదో పంతొమ్మిదో వుంటాయేమో రెండో అమ్మాయికి. స్కిన్ టైట్ జీన్స్ టీషర్ట్. వాళ్లిద్దరితో బ్లూటైతో వున్న యువకుడు. కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి ముఖాలలో నవ్వు ప్రవహిస్తోంది. పక్కనే వో కుర్చీలో అందంగా అమర్చిన పూలగుచ్ఛాలు.

చిరపరిచితమైన దృశ్యం - మాధురి ఆ వంకే చూస్తుంది. ఏయిర్‌పోర్ట్‌లో ఇలా ఎన్నోసార్లు తను, అంజలి, నేహ పుష్పగుచ్ఛాలతో. తమతో సురేషో, విన్సంటో. ఫ్లైట్ లాండ్ అయిన ప్రకటన. కాసేపటికి వొక్కొక్కరూ బయటికి వస్తున్నారు. ఇద్దరు విదేశీయులతో ఇద్దరు భారతీయులు పుష్పగుచ్ఛాలతో చిరునవ్వుతో నిలబడిన అమ్మాయిల దగ్గరికి.

హలో... షేక్‌హ్యాండ్స్. మారిన పుష్పగుచ్ఛాలు.

విదేశీయులిద్దరూ పుష్పగుచ్ఛాలని అపురూపంగా పట్టుకున్నారు. ఆ రంగుపూల పేర్లు వాటి దేశీయ పరిమళం వివరిస్తూ ఆ అమ్మాయిలిద్దరూ బేగేజి వున్న ట్రాలీపై చేతులేసి ముందుకు కదిలారు. ఆ మాటలు ఆలకిస్తూ వారితో మాటలు అడుగులు కలిపిన విదేశీయులు.

వాళ్లు వెళ్లిపోయిన తర్వాత మెల్లగా కదిలిన భారతీయులు.

ఆ దృశ్యం తన అనుభవం.

ఆ అమ్మాయిలు వాళ్లతో స్టార్ హోటల్‌కో గెస్ట్ హౌస్‌కో. వ్యాపార లావాదేవీలలో ఆటవిడుపు యీ చిరునవ్వులు.

మూడేళ్ల క్రితం ఇలాంటి వేళ తడబడే చిరునవ్వు. కాళ్లవేళ్ల వణుకు. గుండెల్లోని దడదడా. తనని యీజ్ చేయటానికి నేహ తీసుకున్న శ్రద్ధ గుర్తొచ్చాయి. ఆ తర్వాత అంజలిలో ఆ దడ. రొటీన్... చైన్... తను ఇమడలేకపోయింది.

"మాధురీ. అంతా మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ కాలేరు. అంతా సినిమా యాక్టర్లు కాలేరు. ఐటి- మేనేజ్‌మెంట్ - మార్కెటింగ్‌లోకి రాలేరు. నీకే టీచర్

వుద్యోగం రాదు. డాక్టర్‌వి కాలేవు. నువ్వు అందమైన దానివి. వో డిగ్రీ ఉంది. నువ్వు పెద్దపెద్ద వుద్యోగాలకి అప్లై చేయలేవు. నీకు పెద్ద డిగ్రీలు లేవు. పోనీ ఎక్కడో దగ్గర వో చిన్ని వుద్యోగంలో వుండాలన్నా వుండనివ్వరు. నీ అందం అటువంటిది. వాడిచ్చే బోడి జీతానికి వాడిని మొయ్యాలి. హెరాస్‌మెంట్. సెక్స్‌వల్ హెరాస్‌మెంట్. మనమిచ్చే కంప్లైంట్‌కి ఆర్గనైజ్‌డ్ సెక్టార్‌లోనే దిక్కు లేదు. యీ అనార్గనైజ్డ్ సెక్టార్‌లో మన గోల ఎవరు వింటారు.'' నూడుల్స్‌ని ప్లేట్‌లోకి వడ్డిస్తూ, ''మంచూరియా బాగుంది కదా,'' అని అడిగింది నేహ.

సోయాసాస్‌కి, టొమేటో సాస్‌కి తేడా తెలియనంతగా నాలిక తడి ఆరిపోయి వున్నానేమో ఇంక మంచూరియా రుచినేం చెపుతా.

ఆమె జవాబు కోసం ఆగకుండా, ''సో మాధురీ. ఇది మంచి కంపెనీ. ప్రతినెలా విదేశీయులో వేరే రాష్ట్రాల వాళ్లో ఎవరో వొకరు వ్యాపార లావాదేవీలపై వస్తారు. వాళ్లు మన గెస్ట్‌లు. అతిథులు. వాళ్లకి ఈ సిటీ చూపించాలి. నెక్‌లెస్ రోడ్డు, గోల్కొండ, హైటెక్ సిటి, శిల్పారామం, మ్యూజియం, చార్‌మినార్. ఫుడ్ అరేంజ్ చెయ్యాలి. డ్రింక్స్‌కి కంపెనీ ఇవ్వాలి. వాళ్లతో వున్నన్ని రోజులు మన సాంప్రదాయ పద్ధతిలో చీర కట్టుకోవాలి. బొట్టు పెట్టుకోవాలి. పెర్‌ఫ్యూమ్, లిప్‌స్టిక్ తప్పనిసరిగా వాడాలి. సెన్సాఫ్ హ్యూమర్ వుండాలి. మనదేశం గురించి వాళ్లకి చెప్పాలి. తాజ్‌మహల్ ప్రేమ మృదువుగా చెప్పాలి. మన బాడీ విషయంలో కాస్త జాగ్రత్తగా వుండాలి. ఏ స్థాయిలోనైనా మన శరీర ఆరోగ్యం ముఖ్యం. మనమే కేర్ తీసుకోవాలి. ఎయిడ్స్ గురించి నువ్వు గుర్తుపెట్టుకో. వాళ్లతో అనకు. కేర్ తీసుకోవాలి,'' బేరర్‌ని పిలిచి- ఐస్‌క్రీమ్‌ని ఆర్డర్ చేస్తూ చెప్పింది.

అప్పటికే మాధురి గొంతు ఆర్చుకుపోయింది. ఇటువంటి జీవితం ఎక్కడో నవలల్లోనో, సినిమాల్లోనో వొకటుంటుందనేది చూచాయగా తెలుసు. కానీ ఆ పాత్ర తనే వేయాల్సిన పరిస్థితి తన ముందుకి రావటం- ఆమె గొంతు తడారిపోయింది.

విదేశీయులకి యీ నెక్‌లెస్ రోడ్డు ఎక్కడ ఆనుతుంది? ఏమి సైట్ సీయింగో?!

''మొదట్లో కాస్త బెరుగ్గా వుంటుంది, మనం వచ్చిన విలువల వలన. కానీ ఇది పార్ట్ ఆఫ్ ది జాబ్. మగపిల్లలమై ఉంటే ఏ రాజకీయ నాయకుడి దగ్గరో, గుండా దగ్గరో బ్రోకర్లం అయేవాళ్లం. లేదా మాఫియా. తప్పొప్పులు ఆలోచించకు. బయట ఎవ్వరికీ తెలియదు. మంచి సంస్థ. మంచి డిజిగ్నేషన్. మంచి జీతం. పెర్క్స్. ఎవరైనా మంచివాళ్లు కనిపిస్తే వొక్కోసారి ప్రేమా పెళ్లి. అమెరికానో యూరప్పో వెళ్లిపోవచ్చు. కొన్నాళ్లు ఈ ఉద్యోగం చెయ్యి. నీ ఫైనాన్షియల్ సమస్యలు తీరుతాయి. మీవాళ్లు ఈ డబ్బులతో వోసంబంధం చూస్తారు. చేసేసుకో. నచ్చితే వుద్యోగం కంటిన్యూ చెయ్యి. లేదా కాస్త దాచుకున్న డబ్బుతో ఏదైనా వ్యాపారం మొదలుపెట్టు,'' బిల్ పే చేసి టిప్ వదిలి నేహ బయటికి నడిచింది.

ఆమె వెంట తను. ఎయిర్‌పోర్ట్‌కి. నేహ డబ్బు- అవసరం- ఎదుగుదల చెపుతూనే వుంది.

ఉద్యోగధర్మమో తనకే తెలియనితనమో మొహమాటమో ఏదో స్పష్టంగా తెలియదు. దడదడలాడే గుండెని నొక్కి చిరునవ్వుని పెదవులపై తళుక్కుమనిపించింది.

''మధూ- ఏంటి కలలు కంటున్నావ్,'' కౌశిక్ పూలగుత్తిని చిలకరిస్తూ అడిగాడు.

పూలపైని బిందువులు తన ముఖంపై.

పర్పుల్ కలర్ ఆర్కిడ్స్.

''థ్యాంక్ యూ,'' వాటిని అందుకుంటూ చెప్పింది. ఇద్దరూ బయటికి వచ్చారు. అతనిని ఆగమని చెప్పి పార్కింగ్ వైపు వెళ్లి కారు తీసుకొచ్చింది.

కారు మలుపు తిరగ్గానే కౌశిక్ సిగరెట్ వెలిగించాడు. స్మోక్ ఎగ్జాస్ట్ బటన్ నొక్కింది.

''వూఁ చెప్పమ్మాయి. ఏంటి కలలు కంటున్నావ్,'' అడిగాడు.

''కలలుకాదు. స్మృతులు. పూర్వ జీవిత దృశ్యం కనిపిస్తే,'' అందామె.

''వో... ఐసీ...'' యాష్‌ట్రేలో దులుపుతూ అన్నాడు.

వో చేత్తో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూ మరో చేత్తో అతని తలని దగ్గరగా తీసుకొని పెదవులపై చిట్టి ముద్దు పెట్టింది. ఎ.సి. చల్లదనం. సిగరెట్టు ఘాటు పరిమళం పర్చుకున్న పెదవుల ముద్దంటే ఆమెకి ఇష్టమని అతనికి తెలుసు.

వొకరివైపు వొకరు చూసుకున్నారు. స్పర్శించుకొన్న చూపులు. పార్కింగ్‌లో కారు పార్క్ చేసి ఆర్కిడ్స్ తీసుకొని లిఫ్ట్ వైపు నడిచింది. అప్పటికే కౌశిక్ లిఫ్ట్‌లో వున్నాడు.

కాలింగ్ బెల్ నొక్కబోతూ ఆగి, ''నిద్రపోతుంటుందా,'' అడిగాడు.

''నిద్రపోదు. నిద్రపోతే ఆంటీ లోపల స్విచ్ ఆఫ్ చేస్తారుగా,'' అంటూ మాధురి కాలింగ్ బెల్ ప్రెస్ చేసింది.

నాన్నమ్మ చేతుల్లోంచి డాలీ నవ్వుతూ తండ్రి చేతుల్లోకి వెళ్లిపోయి చిన్నిచిన్ని వేళ్లతో అతని గడ్డాన్ని లాగటం మొదలుపెట్టింది.

ఆడుకొని ఆడుకొని మెల్లగా నిద్రపోయింది.

"ఎందుకలా వున్నావ్? అటువంటి విషయాలు ఎందుకలా పదేపదే ఆలోచిస్తావ్," ఆమె తలమీద చేయివేసి దగ్గరికి తీసుకుంటూ అడిగాడు కౌశిక్.

అతని కాలర్ బోన్‌పై తలవాల్చి అతని చేతివేళ్ల గోళ్లపై చేతివేళ్లతో స్పృశిస్తూ, "మర్చిపోదామన్నా ఎందుకో అలా అవి గుర్తొస్తూనే వుంటాయి," అంది.

"జీవితంలో గడిచిపోయిన ఫేజ్‌ని తిరిగి తిరిగి ఆలోచిస్తూ వుంటే- ముఖ్యంగా మనలని బాధపెట్టిన వాటిని- వర్తమానంలో కూడా మనం ఆనందంగా ఉండలేం. ఇప్పుడు నీకేం లోటు. మనిద్దరం వొకరి కొకరం వున్నాం. మన బిజినెస్ కూడా యింప్రూవ్ అయింది. పిల్లలు పుడతారో లేదో అనుకునేవాడిని. బై ది గ్రేస్ ఆఫ్ గాడ్, మనకో పాప. బాగున్నాం కదా. వూరి కూరికే ఆలోచిస్తావ్."

నిజంగా బాగున్నట్టేనా...?! లోపలి ప్రశ్నలకి, దిగులుకి కౌశిక్ దగ్గరేం దొరకదని తెలుసు. దిగులు పడితే ఆ దిగుల్ని పోగొట్టడానికి అనేక విధాలుగా ప్రయత్నించటం. తనూ దిగులు పడిపోవటం.

"నిజంగానే మనం బాగున్నాం. వొక్కోసారి ఎందుకో అలా గతం నన్నీడ్చుకుపోతుంటుంది. ముంబై ఏమంది," అడిగింది.

"పనైయింది. రెండు మూడ్రోజుల్లో డాక్యుమెంట్స్ వచ్చేస్తాయి. సమ్మర్ ఫెయిర్ పెడతారంట. రేపట్నుంచి నీ పనేంటంటే ఏషియన్ కంట్రీస్ నుంచి అమెరికా వెళ్లిన వాళ్లని దృష్టిలో వుంచుకొని డిజైనింగ్ చేయటం. మోడల్స్ లిస్ట్ వచ్చేవారం వస్తుంది. ఈసారి బ్రైట్ ఇండియన్ కలర్స్ వాడితే."

"కాషాయం... పసుపు... ఆకుపచ్చ!...

"వూఁ... రేపు చూడాలి రంగులు... ఇప్పుడు రంగులొద్దు... కలలు..." అతన్ని అల్లుకొంటున్న నిద్ర.

ఆమె మెడ వరకు బ్లాంకెట్ కప్పుకొని మెల్లగా పక్కకు తిరిగింది. పొరలు పొరలుగా జ్ఞాపకాలు.

*

లేతాకాశపు రంగు క్యాబిన్.

"ఇలాగైతే ఎలా? ఎందుకంత భయపడతావ్? వాళ్లూ మనుష్యులేగా. ఆసక్తిగా లేదా? గిఫ్ట్ ఏమి ఇవ్వటం లేదా? అలా బెంబేలు పడకు," నేహ చెపుతూనే ఉంది.

మాధురి చూపులన్నీ పొందిగ్గా అమర్చిన పువ్వుల పై నుంచి నేహవైపుకి- తిరిగి పువ్వుల పైకి.

"యిప్పటి వరకు నీపై కంప్లైంట్స్ లేవ్. సిటీ హిస్టరి, ఇండియా- కల్చర్- మ్యూజిక్ ఏదైనా సరే చక్కగా చెపుతావని చెపుతారు. సెన్సాఫ్ హ్యూమర్, చిర్నవ్వు నీలో వున్నాయి. యీ ప్రొఫెషన్‌కి చాలా ముఖ్యమైనవి. ముఖ్యమే కానీ ఎక్కడైనా దొరుకుతుంది. కాని మిగిలిన అన్నింటితో కలిపి వుండటం ముఖ్యం కదా. వేరే డిపార్ట్‌మెంట్‌కి మారిపోవటం అంటే ఏ డిపార్ట్‌మెంట్‌కి వెళతారు? మార్కెటింగ్? ఎం.బి.ఎ. లేదు. పర్చేసింగ్ మెటీరియల్స్? మేనేజ్‌మెంట్‌లో స్పెషలైజేషన్ వుండాలి. ఫైనాన్స్ అయితే ఛార్టడ్ అకౌంటెన్సీ ఉండాలి. సెక్రటేరియట్ అంటే ఎ.సి.ఎస్. లేదు. పోనీ ఐటికి వెళతారా అంటే మీకా ఫీల్డ్‌లో నాలెడ్జ్ నిల్. పోనీ ఇప్పుడు నేర్చుకోవడం మొదలుపెట్టినా అంత ఫీజ్ ఎలా కడతారు. ఆ కోర్స్ ఎలా పూర్తిచేస్తారు? అంతంత ఫీజులని మీరెలా తట్టుకుంటారు? అంతవరకు మీ ఫ్యామిలీని ఎవరు సపోర్ట్ చేస్తారు," నేహ మానిటర్ వైపు నుంచి చూపులని మాధురి వైపు నిలుపుతూ అంది.

క్యాబిన్ తలుపుని కాస్త లోపలికి జరిపి, "ఎక్స్‌క్యూజ్‌మీ," ట్రేతో లోపలికి వచ్చి ఇద్దరి ముందు కాఫీ కప్పులుంచి వెళ్లిపోయాడు ఆఫీస్ బాయ్.

చిక్కని దక్షిణాది కాఫీ సువాసన గొంతులోకి జార్తుంటే, "మీ బ్రదర్స్ ఇద్దరు స్టేట్స్ వెళ్లే వరకు వోపిక పట్టండి. ఈలోగా కొద్దిగా డబ్బులు దాచుకోండి. ఆ డబ్బులతో ఏదైనా వ్యాపారం.... బొటిక్, కాస్మొటిక్స్... చెప్పులకొట్టో... ఏదో వొకటి. కానీ అవి కూడా పాష్ లొకాలిటిలోనే పెట్టాలి. షో ఉండాలి. మీరు వెళ్లిపోతే ఇక్కడెవ్వరూ దొరకరని కాదు. మీకు తెలుసు ఈ ఉద్యోగానికెంత కాంపిటేషన్ ఉందో. అసలీ రోజు కాంపిటేషన్ లేని ఫీల్డ్ వుందా" మృదువుగా అడిగింది నేహ.

మాధురిని అయోమయం ఆవరించింది.

ఈ ఉద్యోగంలో చేర్పించడానికి ఆమె తనని వొప్పించే ప్రయత్నం చేసినప్పుడు కలిగిన అనుభూతులకి అనుభవం లేదు. ఇంట్లో చికాకులని నిస్సహాయంగా చూస్తుండలేకపోయాను. బేలగా బాధపడుతూ ఇంట్లోనే వుండలేకపోయాను. కానీ పార్టుటైం ఉద్యోగం కూడా దొరకని పరిస్థితి. దొరికినా చిన్ని జీతం. అలసటే తప్పా అవసరాలేం తీరకపోవటం. మంచి సంస్థ నుంచి ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు. సంబరపడిపోయాను. వాళ్లు అనుభవజ్ఞులు. అవసరాలని బాగా గుర్తుపట్టారు. వాళ్లకి తెలుసు ఎవరిపై ఏ ప్లేకార్డ్సు వాడాలో. అవసరాలే ప్రాతిపదిక.

వాళ్ల అవసరానికి ఎంతగా న్యాయం చేసానో తెలియదు. ఇంటి అవసరాలని ఎంతమేరా తృప్తి పరచానో కూడా తెలియని స్థితి. అవ్యక్త ఉద్యోగ స్వరూపం కాలుస్తోంది సమస్తాన్ని.

అమ్మకి అంతా చెప్పేస్తే...?! కంగారుపడుతుంది. బాధపడుతుంది. భయపడుతుంది. కోప్పడుతుంది. ఏమన్నా పర్లేదు. ముందీ స్థితి నుంచి బయటికి వచ్చేయ్యాలి.

ఆమెకి కాస్త తేటపడ్డట్టుగా అనిపించింది.

''ఆలోచించండి. మెకానికల్‌గా జాబ్‌లో ఇన్ వాల్వ్ అవ్వండి. సీ యూ... బై...'' నేహ తేల్చేసింది.

వీకెండ్‌కి ఇంటికి వెళ్లింది.

మధ్యాహ్నం భోజనాలు అయిన వెంటనే తమ్ముడు బయటికి వెళ్లాడు. చెల్లాయి స్నేహితులతో సినిమాకి వెళ్లింది. మెయిల్ చూసుకోవడానికి అన్నయ్య నెట్ సెంటర్‌కి వెళ్లాడు. నాన్నగారు నిద్ర పోతున్నారు. వంటింట్లో పని చేసుకొంటూనే టీవిలో సినిమా చూసేస్తోంది అమ్మ.

చెపితే ఇప్పుడే చెప్పాలి. తిరిగి రాత్రికే ప్రయాణం. కాసేపైతే అంతా తిరిగి వచ్చేస్తారు. ఎలా చెప్పాలి? యీ ఉద్యోగంలో ఇమడలేను. ఇలాంటి పరిస్థితిలో చిక్కుకున్నప్పుడు ఇమడటం అనే ప్రశ్నే లేదేమో. సర్దుకుపోవాలేమో. వారివారి కన్నీళ్లకి భవిష్యత్తులో చరిత్రగా రికార్డు చేసే అవకాశమైనా వుందా? వుద్యోగరీత్యా చిరునవ్వు చిందించటం ఎంత కష్టమో అపరిచిత దేహానికి దేహం విచ్చుకోవటం ఎంత దుఃఖదాయకమో. అలవాటైన దుఃఖాన్ని ఎప్పటికప్పుడు కొత్తగా దుఃఖించటం. అనుభవంలోంచి గాయం సలుపుతుంటే, ''వుద్యోగం మానేస్తా,'' అమ్మతో చెప్పింది.

''ఎందుకు,'' మినపప్పు కడుగుతూ అడిగింది.

''ఏదైనా ఇంకోటి వెతుక్కుంటా.''

''అన్ని నెలలు కష్టపడి సంపాదించుకున్న ఉద్యోగం వదిలేస్తావా? ఎందుకు? నిక్షేపంలాంటి సంపాదన. అన్నయ్య అమెరికాకి వెళ్లాల్సిన పేపర్లు నెలాఖరుకి వచ్చేస్తాయంట. అవి వచ్చేస్తే వాడు వెళ్లిపోతాడు. కాస్త తేరుకున్నాక వాడు కొన్ని డాలర్లు పంపిస్తాడు కదా. అప్పుడింత ఇబ్బంది వుండదు. చిన్నాడికి ఇంకా నలభై వేలు ఫీజ్ కట్టాల్సింది వుంది. వాడు వచ్చే ఏడాది అమెరికా వెళ్లిపోతాడు. వాడు కాసిన్ని డాలర్లు పంపిస్తాడు. చెల్లాయి చదువుకి ఇబ్బంది వుండదు. చిన్నోడికి కంప్యూటర్ కావాలంట. ఆ లాబ్‌లో ఎక్కువసేపు ప్రాక్టీస్ చేయటానికి దొరకదంట. ఇంట్లో వుంటే ప్రాక్టీస్ చేసుకోవచ్చంట. అన్నయ్య స్టేట్స్ వెళ్లిపోతాడు కదా. ఇంట్లో కంప్యూటర్ వుంటే మెయిల్ చేసుకోవచ్చు. బయటికి వెళ్లాలంటే నాకెక్కడ వీలవుతుంది చెప్పు,'' జార్‌లో మినపప్పు వేస్తూ అంది అమ్మ.

మిక్సీ బర్ బర్ర్ అని తిరుగుతోంది.

నాన్నగారి వొక్కరి సంపాదనా సరిపోకే త్వరగా ఉద్యోగం వెతుక్కోవలసి వచ్చింది. ఆ సంస్థలో నేనో ఆఫీసర్‌నని ఇంట్లో అందరికి తెలుసు. పెద్దవాళ్లతో డీలింగ్ అని తెలుసు. కాని ఈ జాబ్‌లో వున్న ముఖ్యమైన పని వాళ్లకి తెలియదు.

''ఎక్స్చేంజ్ సేల్ వచ్చినప్పుడు యీ మిక్సీ మార్చాలి. పాతదైపోయింది. అరిగిపోయింది. ఇప్పుడు చాలా రకాలవి వస్తున్నాయి కదా. చపాతి పిండి కూడా కలుపుకోవచ్చు. జ్యూసర్ దొరికితే ఈసారొచ్చినప్పుడు పట్రా'' జార్‌లోంచి పిండిని గిన్నెలోకి తీస్తూ చెబుతోంది.

''అరటికాయ బజ్జీలు వేద్దాం. వో నాలుగు కాయలు తరుగు,'' అంది.

చేతికి నూనె రాసుకొని అరటికాయ చెక్కు తీస్తూ, ''వుద్యోగం నచ్చలేదు,'' అన్నాను.

''ఎందుకనీ? ఏ ఉద్యోగమైనా ఏదో ఒక గొడవ ఉంటుంది. మీ నాన్నగారిని అడుగు చెపుతారు. పై వాళ్లతో కిందివాళ్లతో ఏదో వొక చికాకు. సర్దుకు పోవాలి,'' కళాయిలో నూనె పోస్తూ అంది.

''మీ బాస్ డిన్నర్‌కి రమ్మని సతాయిస్తున్నాడా? ఆడాళ్లని ఏదో వొకటి అలా అంటుంటారు. అందంగా వుంటావ్ కదా. ఇంకాస్త ఎక్కువ చికాకు ఉంటుంది. లౌక్యంగా మెసులుకోవాలి. అంతేగాని అలా బెంబేలు పడిపోతే ఎలా,'' మరిగిన నూనెలో శెనగపిండిలో ముంచిన అరటికాయ ముక్కలు వేస్తూ అందామె.

మధ్యాహ్నపు గాలులకి పెరట్లో చెట్లకొమ్మలు అప్పుడప్పుడు వూగుతున్న సవ్వడుల నడుమ నుంచి ''డిన్నర్.... నీకెలా తెలుసు,'' గొంతు తడారిపోతోంటే మాధురి అడిగింది.

''యింట్లో వుండే మీ అమ్మకి ప్రపంచం తెలియదనుకున్నావా? తెలుసు. టి.వి.లో సీరియల్స్ చూస్తున్నాంగా. అవును ఎగ్జిబిషన్‌లో ఎలక్ట్రిక్ కుక్కర్ అమ్ముతారంట కదా. మంచిదొకటి ఈసారి పట్రా. చిన్నోడు క్లాసు నుంచి వచ్చేసరికి పదో పదకొండో అవుతోంది. అందులో అన్నం వండితే ఎంతసేపైనా వేడిగా వుంటుందంట కదా'' అంది అమ్మ.

ఇంట్లో కాస్త ఇబ్బంది లేకుండా ఇంకాస్త రాబడి వుంటే బాగుంటుందనుకున్నాం. ఉద్యోగానికై వెతుకులాట. ఇబ్బంది తీరటం ఎలా వున్నా అవసరాల చిట్టా పెరుగుతూనే ఉంది. ఎవరినేం అన్నా ఏడవటం.

అలకలు. పస్తులు. అరుపులు. ఎలాగోలా సరిపెట్టుకొని ఎవరికి దొరికిన ఉద్యోగంలో వాళ్లని చేరిపోమంటే.

'డిన్నర్‌కి పిలిచి చెయ్యి పట్టుకోవటమో కళ్లల్లోకి చూపులు జార్చటమో కాదమ్మా. ఇప్పుడే లౌక్యాలు అక్కర్లేదు. ఏ ముసుగులూ లేవ్. అవసరాలే. మేధస్సు శరీరమూ పెట్టుబడి అంతే.'

"బట్టలు ఆరాయేమో చూడు. ఏంగాలో," అమ్మ అంటుంటే పెరట్లోకి వెళ్లి ఆరిన బట్టలు తీస్తూ, 'ఇంక ఈ విషయం అమ్మ మాట్లాడదన్నమాట,' అనుకొంది మాధురి.

కాసేపైన తర్వాత మాధురి వంటగదిలోకి ఆరిన బట్టలతో వచ్చేసరికి తల్లి లేదక్కడ. పక్కింటావిడకి బజ్జీలు ఇవ్వడానికి వెళ్లి కబుర్లు చెబుతూ కనిపించింది. ఇక ఈ విషయం మాట్లాడే ఛాన్స్ లేదని మాధురికి పూర్తి నిర్ధారణ అయింది.

నెలాఖరుకి అమెరికా వెళ్లటం ఖాయం. వెలుగు చిమ్ముతోన్న చూపులతో నెట్ సెంటర్ నుంచి వచ్చిన పెద్దాడికి మంచినీళ్లిస్తూ, "త్వరగా సెటిల్ అయి ఇంటిని కాస్త పట్టించుకో," చెపుతోంది అమ్మ.

విశాఖ సంపెంగలని మాలకట్టి అరిటాకులో చుడుతూ, "రైల్లో తినటానికి ఏం కట్టమంటావ్," అడిగింది అమ్మ.

"ఏదో వొకటి. అయినా ట్రైన్‌లో దొరుకుతా యిలే," అంది మాధురి.

"అవేం బాగుంటాయ్'.' అంటూ వంటగదిలోకి వెళుతూ, "మధూ," అని పిలిచిందామె.

"నీది ఎలాంటి చికాకైనా కాస్త సర్దుకుపోమ్మా. నువ్విప్పుడు ఉద్యోగం మానేస్తే వీళ్ల చదువులకి చాలా కష్టం అవుతుంది. ఇంటి పరిస్థితి చికాకుగా అయిపో తుంది. కొన్నాళ్లు కష్టపడితే అంతా వొక దారికి వస్తారు. నాలుగు డబ్బులు వెనకేసుకుంటే నీ పెళ్లి చెయ్యొచ్చు. పొరపాటున కూడా వుద్యోగం మానెకు. ఎక్కడైనా మగాళ్లతో ఏదో ఒక చికాకు వుంటుంది కద తల్లీ. కాస్త వోపిక పట్టు," బతిమాల్తోంది.

ఆమె మాటల వెనుక నిస్సహాయత. ఆవేదన స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమెకి ఎలా విడమర్చి చెప్పాలి.

స్టేషన్‌కి బయలుదేరే ముందు సంపెంగల పొట్లం చేతిలో పెడుతూ, "కాస్త వోపిక పట్టు. మీ నాన్న గారి ఆరోగ్యం కూడా అంతంతే..." కళ్లనీళ్లు గొంతు జారి మాటలు లోలోపలే ఆగిపోతోంటే...

మాధురి తలపై చేయి వేసి నిమిరింది.

నిస్సహాయంగా ఇంట్లోంచి బయటికి కదుల్తూ వెనక్కి చూసింది. మూర్తీభవించిన నిస్సహాయత అమ్మగా నిల్చుంది గుమ్మం దగ్గర.

"అంత భరించరాని కష్టం ఏం కాదమ్మా. వూరికే, అలా అనిపిస్తుంది అప్పుడప్పుడు. బెంగపడకు. కుక్కర్ పట్టుకొస్తా," అప్రయత్నంగా చిర్నవ్వుతో చెప్పేసింది.

ఆమెనెందుకు బాధపెట్టాలి - వొంటరిగా కన్నీరు కార్చటం నేర్చుకుంటే సరి.

"ఈమె అంజలి," వో రోజు వో పద్దెనిమిదో పంతొమ్మిదో వున్న అమ్మాయిని తీసుకొచ్చి మాధురికి పరిచయం చేసింది నేహ.

అంజలి ఎక్కువగా మాట్లాడేది కాదు. పలకరింపుగా నవ్వేది. వోరోజు వాళ్లిద్దరూ ఏర్‌పోర్ట్‌లో ఫ్లైట్ కోసం ఎదురు చూస్తున్నారు.

"డాడీకి పొలిటికల్ ఇన్‌ఫ్లూయన్స్ వుంది. ఇంట్లో అందరికంటే చిన్నదాన్ని. చాలా ముద్దుగా చూస్తారు. వోన్‌గా వుండాలనుకుంటున్నాను. నాక్కావల్సింది సంపాదించుకోకపోతే ఇంట్లోవాళ్లని అడగాలి. బాగా ఖర్చు చేస్తా. ఇంట్లో వాళ్లపై ఆధారపడితే వాళ్లు చెప్పినట్లు వినాలి. స్పేస్ అంతా పోతుంది," అంజలి చెపుతోంది సురేష్‌తో.

శ్రద్ధగా వింటున్నట్టు తలూపుతున్నాడు సురేష్.

అంజలి ఆఫీసులో జాయిన్ అయి రెండు నెలలు అయింది.

మాధురి మంత్లీ ఎక్స్‌పెండిచర్ స్టేట్‌మెంట్ కంపోజ్ చేస్తుంటే సురేష్ వచ్చాడు.

"భలే పోరి. నోరు విప్పితే గప్పాలే గప్పాలు. వాళ్ల నాన్న దివాళ తీసిన పెంకుల వ్యాపారి. వాళ్ల అన్న లోకల్ ఎమ్మెల్యే దగ్గర బ్రోకర్. వాళ్ల అన్నా వదినలది వేరింటి కాపురం. పెళ్లి కావల్సిన అక్కలిద్దరున్నారు. అంజలి సంపాదించి ఇంటికి పంపిస్తేనే తిండి తినటం. ఇంతకు ముందు గోవాలో టూరిస్టు సీజన్‌లో పనిచేసింది. అక్కడి ఎగ్జిక్యూటివ్ నేహ మేడమ్‌కి తెలుసంట. వాళ్ల వూరికి దగ్గరగా అంజలి వుండాలనుకుంటుంటే ఆమె నేహ మేడమ్‌ని అడిగారంట. అంజలికి వాళ్ల అమ్మ గారిని మూడు నాలుగు నెలలకోసారి చూడకపోతే బెంగగా వుంటుందంట. అంజలి మాత్రం నోట్లో వెండి స్పూన్ పెట్టుకొని పుట్టినట్టు కబుర్లు చెబుతుంది. బీర్ బాటిల్ కోసం ఎవడి బండైనా ఎక్కేస్తుంది. అంజలికి బాగా డబ్బులు కావాలి. ఆమె అ..."

"సురేష్ యీ స్టేట్‌మెంట్ ప్రింట్ తీయాలి. ఎందుకో సరిగ్గా రావటంలేదు. రాంగ్ కమాండ్ అనుకుంటా. కాస్త చూస్తావా," చప్పున అడిగి అతని మాటలని కట్ చేసేసింది ఆ సమయానికి.

మగపిల్లలకేం తెలుస్తాయి అమ్మాయిల ఆనంద విషాదాలు...

వో గట్టి ప్రయత్నం మీద వో స్టార్ హోటల్లో రిసెప్షనిస్ట్ వుద్యోగం వచ్చింది. ఆలస్యం చేయకుండా మాధురి జాయిన్ అయిపోయింది. జీతం ఆ ఉద్యోగంలో కంటే తక్కువే. అయినా ఈ అవకాశాన్ని వదులుకో దల్చుకోలేదు. ఇంట్లో అవసరాలు బెంబేలుపడ్డాయి. లోపలి సెగ కంటే ఆ ఇంటి గొడవని భరించటానికే సిద్ధపడిందామె.

వోరోజు అంజలి వచ్చింది ఆకస్మికంగా మెరుపు, సంశయం కలబోసిన చూపుల్తో.

కౌంటర్‌లో మాధురి బాగా బిజీగా వుండడంతో ఆమె పని పూర్తయ్యేవరకు లాంజ్‌లో ఎదురు చూసిందామె.

ఇద్దరూ బయటికి వచ్చారు. అంజలిని తమ పేయింగ్ గెస్ట్‌గా వుంటున్న ఇంటికి తీసుకువెళ్లాలని పించలేదు మాధురికి. అంజలికి తనకి స్నేహం లేదు. పని పరిచయం తప్పా. ఏం తెలియని వాళ్ల ముందు జీవితాలని పరిచేస్తే తర్వాత మనల్ని మనమే నిందించుకోవాలి.

''యెక్కడ కూర్చుందాం,'' మాధురి అడిగింది.

రెస్టారెంట్‌లో కూర్చున్నారు.

''మనం ఇలా కల్సినట్టు ఎవ్వరికీ చెప్పకండి. అసలు ఏ విషయాలూ చెప్పకండి. నాకు డబ్బులు అవసరమే. చాలా. కానీ ఇలా సంపాదించాలని ఎప్పుడూ అనుకోలేదు. నాన్నది బాధ్యతా రహితం. అన్నయ్యది పెత్తనం. పిల్లల జీవితాలు ఇలా ఎందుకైపోతాయ్. తండ్రుల వల్లే. ఆ ఇంటిని నిలబెట్టటానికి మా అమ్మ ఎంత కష్టపడుతుందో. నేనిలాంటి ఉద్యోగం చేస్తున్నానంటే మా అమ్మ బాధపడుతుంది. మా నాన్నకేం వుండదు. మగాళ్లతో తిరిగితే తిరిగావ్ కానీ కడుపు తెచ్చుకోకు అనేరకం మా అన్న. మీరు మంచివారని తెలుసు. ఎక్కడా ఏం మాట్లాడరని తెలుసు. విషయం ఏమిటంటే... సురేష్ ప్రేమిస్తున్నానంటున్నాడు,'' అని ఆగిపోయింది అంజలి.

అంజలి యిదంతా ఎందుకు చెపుతోంది?

''అసలు పీస్ లేకుండా పోయిందండి. పీస్ కావాలి. ఇల్లు కావాలి. కారు, బ్యాంక్ బ్యాలన్స్ కావాలి. మా ఇంట్లో పెళ్లి చేసే స్తోమత లేదు. లేచిపోవాలి. లేదా పారిపోవాలి. ఈ రోజుల్లో ఇలాంటి సాహసాలు చేసే మగవాళ్లు ఎవ్వరూ లేరు. సురేష్ ఇక్కడ జాబ్ మానేస్తాడంట. కాంట్రాక్ట్ చేద్దామనుకుంటున్నాడు. సంపాదించగలడు. చూడటానికి బాగుంటాడు. ప్రేమగా వున్నాడు. పెళ్లి చేసుకుందాం అన్నాడు. మంచివాడేనా?'' అడిగిందామె.

''ఏమో. మనం జీవితం పంచుకోవాలనుకుంటున్న వ్యక్తులు ఎలాంటివాళ్లో ఎవరికివాళ్లే తెలుసుకోవటం మంచిదేమో,'' సురేష్, అంజలిని గతంలో పల్చగా మాట్లాడటం గుర్తున్నా మాధురి చెప్పకుండా అలా అంది.

అతని అభిప్రాయం కాలంతో మారిందేమో. లేకపోతే పెళ్లి అనడు కదా. అవి ఇప్పుడు చెప్పి అంజలిని బాధపెట్టడం ఎందుకు.

''నాకో చెత్త ఆలోచన వచ్చిందండి. నాతో బిజినెస్ చేయించడు కదా... లేదా పెళ్లికి ముందు ఎలా తిరిగినా పెళ్లయ్యాక కుదురుగా వుంటే చాలు అనుకునే బాపతేమో'' అందామె నవ్వుతూ.

మరో కాఫీ ఆర్డర్ చేసారు. రెస్టారెంట్ కిటకిటలాడుతోంది. మ్యూజిక్ ఎవరి మాటలనీ పక్కవాళ్లకి వినిపించనివ్వటంలేదు.

''ఆల్ ది బెస్ట్ అంజలి,'' మాధురి మనస్ఫూర్తిగా చెప్పింది.

మార్నింగ్ షిఫ్ట్. ఉదయం ఫ్లైట్‌కి వెళుతోన్న గెస్ట్స్ బిల్స్ లిస్ట్ ఫీడ్ చేస్తోంది మాధురి.

''హాయ్ మేడమ్. నిన్నంతా కనిపించలేదు,'' వినిపిస్తే తలెత్తి చూసింది.

కౌశిక్...

''హాయ్ వీక్లీ ఆఫ్... ఏంటి వెళుతున్నారా? తిరిగి ఎప్పుడొస్తారు?'' అడిగింది.

''పదిరోజుల తర్వాత.''

అతను తరచుగా అదే హోటల్లో వుండటం, పరిచయం, పలకరించుకోవటం.

పదిరోజుల తర్వాత కౌశిక్ వచ్చాడు. డల్‌గా వున్నాడు.

''డల్‌గా ఉన్నారేంటి,'' అడిగింది మాధురి.

''ఎక్కడైనా కలవగలరా,'' అడిగాడు.

క్లబ్‌లో కలిశారు.

స్విమ్మింగ్‌పూల్ పక్కన టేబిల్‌కి అటూ ఇటూ కూర్చున్నారు. వాలిన కొబ్బరాకు చీలికల్లోంచి రెల్లుపూల జల్లులా లేత వెన్నెల. ఇద్దరి ముందు ఆరెంజ్ జ్యూస్‌లో ఇంకుతోన్న వోడ్కా. వినీవినిపించని ట్రేసీ స్వరం.

''బిజినెస్‌లో చికాకులు. కష్టపడి అంతా ఎస్టాబ్లిష్ చేసా. చివరికి మరొకరికి పర్మిషన్ ఇచ్చేసారు. తిరిగి మొదట్నుంచి వర్కౌట్ చెయ్యాలి'' అన్నాడు.

''ఏం బిజినెస్.''

''ఫ్యాషన్ డిజైనింగ్.''

అతని దిగులుని ఆమె పంచుకొంది. ఇద్దరూ కాస్తకాస్తగా జీవితాలని పరుచుకున్నారు. అతని సమక్షం లో ఆమె అనాచ్ఛాదిత. ఏ గడియల్లో అతనిపై విశ్వాసం కలిగిందో ఆమెకి తెలియదు.

''మధూ నీ పెళ్లి బాధ్యత నాదే. అబ్బాయిని వెతుకుతాను,'' అన్నాడో రోజు ఆమె కనురెప్పలపై పెదవులు ఆన్చి.

అతని మెడ చుట్టూ వున్న ఆమె చేతులు అప్రయత్నంగా అతనిని మరింత గాఢంగా పెనవేసుకున్నాయి.

''మనిద్దరం వొకరి లోపలి విషయాలని వొకరు పంచుకొన్నాం. దేహాలతో మాట్లాడుకున్నాం. వొకరి పట్ల వొకరం తడిగా ఉన్నాం. కానీ పెళ్లి మాత్రం మరొకరితో అంటున్నాం. గొప్ప నమ్మకంతో ప్రేమగా ఏ ఆచ్ఛాదనలూ లేకుండా వ్యక్తం చేసుకొని వొకరికి మరొకరు అత్యంత సామీప్యానికి వచ్చి కూడా జీవితానికి పూర్తిగా హత్తుకొనే అనుబంధాన్ని మాత్రం ఎందుకు వద్దంటున్నాం. వేరే వెతుకులాట ఎందుకు? మనం మన జీవితం లో పార్టనర్‌గా వుండేవాళ్ల నుంచి ఏం కోరుకుంటున్నాం? తెరల్లో వుండాలనుకుంటున్నామా?! మనలోని ఆకర్షణీయమైనది, వున్నతమైనది అనుకున్నది మాత్రమే వొకరికొకరం ప్రెజెంట్ చేసుకోవాలనుకుంటున్నామా? జీవితాన్ని పంచుకోవటం అంటే ఏమిటి? లోపల్లోపలి అశాంతి ఏ పరస్పరానుభవం వల్ల రవ్వంతగా కదుల్తుందో అది ఏది? ఏ పరిమితులు పెళ్లి అనే ఆలోచన ఇవ్వటంలేదు?'' ఆమె ఆ ప్రశ్న వేయకుండా వుండలేక పోయింది.

వింటున్న అతని చూపుల్లో ఏ కదలికా లేదు.

అలజడిని అలా బయటికి చెప్పకుండా వుండాల్సిందా? అతని సామీప్యంలో తనని తాను నిండుగా వ్యక్తపర్చుకోవటం. అలా వ్యక్తపర్చుకోలేకపోతే అతను అందరిలో వొకడే కదా. అవ్యక్త ప్రేమలెందుకు? అతనికై ఎదురుచూపులు- కనిపిస్తే సంబరం. కనిపించకపోతే దిగులు. వేకువలో అతనికోసం తడుముకునే చేతులు. భవిష్యత్తులో గత జ్ఞాపకాలుగా మిగిలిపోవల్సిందేనా?! గత స్మృతుల్లోంచి కాక మనోస్పర్శ జీవితమంతా ప్రవాహంలా స్పర్శించాలి.

ఆమె అతనికి చెపుతూనే వుంది.

''నో... నో వే''... అతను లోపల్లోపల కూడ బలుక్కుంటున్నాడు. కోల్పోతోన్న గాయంతో ఆమె దైనందిన జీవితంలో అటుయిటూ తిరుగుతోంది. కానీ లోలోపల సెగ రాజుకుంటోంది. అతను తననుంచి ఎందుకు దూరంగా వుండాలనుకుంటున్నాడు. తన గత జీవితం వలనా?! చుట్టూ దట్టమైన మాయ. ఆ పొరలు కమ్ముకోకుండా నిలువరించే శక్తి ఎవరి జీవితాలకైనా వుందా?

ఆదివారం.

డ్యూటీ లేదు. ఐబ్రోస్ థ్రెడింగ్ చేయించుకొని పెడిక్యూర్, మేనిక్యూర్ పూర్తి అయ్యాక తలకి గోరింటాకు పెట్టించుకొని మాధురి వో పక్కగా కూర్చుని చీరకి ఫాల్ కుట్టుకుంటోంది. వారానికోసారి బ్యూటీషియన్ మొత్తం సరంజామాని తీసుకొని మాధురి పేయింగ్ గెస్ట్‌గా వున్న ఇంటికి వస్తుంది. అమ్మాయిలంతా కావల్సినవన్నీ చేయించుకుంటారు.

''మధూ, నే బ్లంట్ కట్ చేయించుకోనా?! బాగుంటుందా,'' అడిగిందో పొడవు జుట్టున్న అమ్మాయి.

''యెందుకు తల్లీ అంత తొందర. నువ్వేం కష్టపడక్కర్లేదు. యీ పొల్యూషన్‌కి అదే వూడి వూడి పోతుంది. గుండు కాకుండా వుంటే సంతోషించాలి,'' ఫేషియల్ చేయించుకుంటున్న అమ్మాయి అరిచింది.

''మధూ నీకోసం ఎవరో వచ్చారు,'' ఆంటి చెప్పారు.

నాకోసమా? స్నేహితులెవరూ లేరు. ఇంట్లో వాళ్లు చెప్పకుండా రారు. ఎవరై ఉంటారు? అంజలి... వెతుక్కుంటూ వచ్చేసిందేమో.

మాధురి లివింగ్ రూంలోకి వచ్చింది.

యంటివి ఛానల్ చూస్తున్న అమ్మాయిల మధ్య కూర్చుని గుమ్మం వైపు చూస్తున్నాడు కౌశిక్.

ఆశ్చర్యం, సంబరం తుళ్లింతగా.

''అరగంట వుండగలవా,'' అడిగింది.

''వూఁ''

తలస్నానం చేసి సీగ్రీన్ షిఫాన్ శారీ కట్టుకొని బయటికి వచ్చిందతనితో.

కురుల్లోంచి అతన్ని తాకుతోన్న గోరింట పరిమళం మత్తుగా.

రెస్టారెంట్‌కి వెళ్లారు. మసక వెల్తురు. పియానో మెత్తగా వీస్తోంది. వొంటిని లేతపొగలా అల్లుకుంటున్న చల్లదనం. టేబిల్‌కి అటూ యిటూ వాళ్లిద్దరు. మధ్యలో తెల్ల గులాబి.

ఆర్డర్ ప్లేస్ చేశాక, ''భలే వున్నావ్. నీకీ రంగు బాగా నప్పింది. ఎంతమంది వుంటారక్కడ,'' అడిగాడు.

''ఆంటీని చూసావు కదా. ఆమెకి ఇద్దరు పిల్లలు. స్టేట్స్ వెళ్లిపోయారు. రెండేళ్ల క్రితం అంకుల్ పోయారు. వొంటరిగా అంతింట్లో వుండటం ఆమెవల్ల కాలేదంట. ఆమెని పిల్లలు అక్కడికి రమ్మనలేదంట. పేయింగ్ గెస్ట్‌గా ఇద్దరమ్మాయిల్ని వుంచుకుంటే అనే ఆలోచన వచ్చిందామెకి. ఇన్‌కమ్ ప్లస్ తోడుగా వుంటారనిపించి

ఇద్దరితో మొదలుపెట్టింది. ఇప్పుడు పదిమందిదాకా వున్నాం. హైటెక్ సిటీలో పనిచేస్తున్న వాళ్లే ఎక్కువ," అందామె.

"యిక్కడ వర్కింగ్ వుమెన్స్ హాస్టల్స్, మెస్‌లు పెరిగాయి కదా," అడిగాడు.

"వూఁ... బాగా డిమాండ్ వుంది. మంచి ఫుడ్ పెట్టి కాస్త శుభ్రంగా వుంచితే చాలు అమ్మాయిలు ఆనందంగా జాయిన్ అయిపోతారు," వాజ్‌ని అటూ యిటూ కదుపుతూ అందామె.

ఆమె చేతివేళ్లని స్పర్శిస్తూ "నీకూ నాకూ మధ్య వయస్సులో తేడా ఉంది. నీకంటే దాదాపు పధ్నాలుగేళ్లు పెద్దవాడిని. మా యింట్లో ఈ పెళ్లిని ఎలా తీసుకుంటారో తెలియదు," అని ఆగాడు.

చాలామంది కుర్రాళ్లు అమ్మానాన్నలని బాధపెట్టే పనులని తమకి నచ్చితే చేసేస్తుంటారు. కానీ పెళ్లి విషయంలో మాత్రం ఇంట్లోవాళ్లని నొప్పించటం ఇష్టం లేదనే సాకునో, సెంటిమెంట్‌నో చూపించి ఇంట్లో వాళ్లని నొప్పించలేక అని చెప్పి కంఫర్టబుల్‌గా తప్పుకుంటారు. నిజానికి వాళ్లకి ప్రేమని జీవితంలోకి అనువదించుకోవాలని వుండదు. కౌశిక్ అలాంటి తరహా కుర్రవాడా?!

"నీకో మంచి అబ్బాయిని చూసి పెళ్లి చేస్తానని చెపుతున్నప్పుడంతా నాలో అలజడి. అన్నీ ఆలోచించా. నా ఎసెన్షియల్ బీయింగ్ నువ్వేననిపిస్తోంది," ఆగాడు.

"ఇద్దరు వ్యక్తులు వొక అర్థవంతమైన అవగాహనకి వచ్చామనుకొని కలిసి నడుద్దామనుకునే నిర్ణయానికి రావటం కష్టం. కాని వొకసారి వచ్చాక మిగిలినవన్నీ చిన్ని చిన్ని విషయాలు," అందామె.

పేపర్ నేప్‌కిన్ తీసి అతనో పది పేర్లు రాసి ఆమె వైపు జరిపి, "నువ్వు పిలిచేవాళ్ల పేర్లు రాయి," అన్నాడు.

"మా పేరెంట్స్, తమ్ముడు, చెల్లాయి, ఆంటీ, మా గ్రాండ్ పేరెంట్స్. అన్నయ్య అంత దూరం నుంచి రాలేడు. మొన్నేగా వెళ్లాడు," అందామె.

"రిజిస్టర్ మ్యారేజ్, డిన్నర్. హనీమూన్‌కి ఎక్కడికి వెళదాం."

"మరీ అలా హనీమూన్ అనకు. ముందు ఇద్దరం వుండటానికో ఇల్లు వెతుక్కోవాలి," అందామె.

మాధురి సంసారం మొదలుపెట్టిన రెండో నెలకి వొరోజు అంజలి హోటల్‌కి హఠాత్తుగా వచ్చింది.

"సురేష్‌కి నేనంటే చాలిష్టం. నేనే పని చెప్పినా చేసేస్తున్నాడు. అతను కాస్త సెటిల్ అయ్యాక ఉద్యోగం మానేస్తాను. ప్రేమగా వుంటున్నాడు," అందామె.

"పోయినవారమే వద్దామనుకున్నా. ఈసారొచ్చిన గెస్ట్‌లు గోవా, వూటీ వెళ్లాలని సంబరపడ్డారు. నేనక్కడ వుండి వచ్చాను కదా నేహ వెళ్లమంది. ఆ వచ్చిన సొంబేరులకి చిన్ని చిన్ని పిల్లలు కావాలన్నారు. చిన్ని చిన్ని పిల్లలు ఎంతమందో ట్రేడ్‌లో. కొందరేమో వో పక్క పిల్లల్ని వెతికో వెతక్కుండానో చక్కగా వ్యాపారంలో నింపేస్తున్నారు. మరోపక్క హెల్త్‌వర్కర్లనో వాలంటీర్లనో కండోమ్స్ పంచి పెట్టేస్తున్నారు. అలా రోగాలని ఆపాలనుకుంటారు. భలే చికాకేసిందనుకోండి. ఈ పిల్లల మాట ఆ కస్టమర్స్ వింటారా? సురేష్ త్వరగా సెటిల్ అయితే ఇందులోంచి బయటపడిపోవాలండి," అందామె.

అంజలికి కాఫీ తెప్పించి యిచ్చింది.

"వాళ్ల మదర్‌కి ఆరోగ్యం బాగులేదంట. బాగయ్యాక ఇంట్లో విషయం చెపుతానన్నాడు. సురేష్ జాబ్ మానేశాడు. తన కొత్త బిజినెస్‌కి సంబంధించిన ఆఫీసుని ఎస్టాబ్లిష్ చేసే పని చేస్తున్నాడు. కాస్త పనులన్నీ పూర్తయ్యాక జాబ్ రిజైన్ చేసి అక్కడే జాయిన్ అవుతా. మీరెలా వున్నారు," అడిగిందామె.

"పెళ్లి చేసుకున్నాను," అంది మాధురి.

"యింట్లో వాళ్లు చూసారా"

"లేదు. నాకే పరిచయం."

"మీ విషయం తెలుసా."

"అన్నీ తెలుసు."

"ఎందుకు చెప్పారు? అవసరమా."

"పరిచయం. మెల్లగా స్నేహం. స్నేహంలో మా ఇద్దరం జీవితాలని విప్పుకున్నాం. అక్కడ నుంచే ఇష్టం. కలిసి బతకాలనుకోవటం చెప్పటం చెప్పకపోవడం, వ్యాల్యూ జడ్జిమెంట్ కోసం కాదుకదా. జీవితాన్ని కొంత మందితో పంచుకోవాలనిపించటం. కొంతమందితో మనం సినిమాకి వెళ్లామని కూడా చెప్పడానికి ఇష్టపడం. మనకి అనిపించటం ముఖ్యం కదా. మన ఛాయిస్ కదా," అంది మాధురి.

అంజలి కౌశిక్ ఎటువంటి వ్యక్తో అని అంచనా వేయటానికి ప్రయత్నిస్తూ, 'వొసారి చూడాలి,' అనుకుంది.

*

మూడు నాలుగు రోజులుగా సురేష్ నుంచి ఫోన్ లేదు. మనిషి కనిపించలేదు. అతనింటికి ఎప్పుడూ అంజలిని రమ్మని పిలవలేదు. ఫోన్ చేయొద్దన్నాడు. తమ విషయం టైమ్ చూసుకొని తను ఇంట్లో చెప్పే వరకు జాగ్రత్తగా వుండాలన్నాడు. ఈ మధ్య తరచుగా మూడునాలుగు రోజులు మిస్ అయిపోతున్నాడు. అడిగితే పనులంటాడు. ఏం పనులో...

''అంజలీ ఫోన్,'' అంది నేహ.

''హాయ్... తల్లీ... ఎలా వున్నావ్? చాలారోజులైందిరా... చూడాలనిపిస్తోంది. బిజీగా ఉన్నా. అయినా ఫర్లేదు. వచ్చై,'' ఆత్మీయంగా సురేష్.

అంజలి కళ్లల్లో మెరుపు.

''నేహా వెళుతున్నా,'' అంజలి చప్పున బయటికి వచ్చేసింది. నేహా ఆమె వెళ్లినవైపు చూస్తూ 'పిచ్చిపిల్లా' అనుకుంది దిగులుగా.

యిద్దరూ ఐస్‌క్రీమ్ పంచుకున్నారు.

''నువ్వు వాళ్లని డిన్నర్‌కి తీసుకువెళ్లు,'' అన్నాడు సురేష్.

''డిన్నర్‌కి.''

''యస్.''

అంజలి కాసేపు మాట్లాడలేదు.

''డిన్నర్ అంటే...'' తిరిగి అడిగింది.

''కొత్తగా అడుగుతున్నావేంటి,'' సురేష్ నవ్వాడు.

''పాత అర్థమేనా.''

''ఆఁ''

తిరిగి నిశ్శబ్దం.

''అంజలీ. మనం కొన్ని విషయాలని వృత్తిపనిలా మాట్లాడుకోకుండా వుంటే మంచిది,'' అన్నాడు సురేష్.

ఆమె కళ్లల్లో నీళ్లు.

''అరే... ఏమిటీ పాతివ్రత్యం,'' చేతివేలితో కళ్ల నీళ్లు తుడుస్తూ అన్నాడు.

అంజలి వెక్కెక్కి ఏడ్చేసింది.

''అంజలీ అరే ఏంటిది? నాకీ సెంటిమెంట్స్ నచ్చవ్. చికాకు. బి ప్రాక్టికల్. మనం బిజినెస్‌లో కొత్తగా ఎంటరయ్యాం. నిలదొక్కుకోవాలి. బయట అమ్మాయిలని నమ్మలేం. తప్పదు. నువ్వెందుకింతగా వర్రీ అవుతున్నావో అర్థం కావటంలేదు. నేన్నీతోనే వున్నాను కదా. లేరా... చూడు యీ కళ్లిలా చిన్నబోయాయో. కొన్నాళ్లేరా తర్వాత నీ యిష్టం. బంగారం. లే... లే...'' అనునయంగా అన్నాడు సురేష్.

''నో... మనిద్దరం పెళ్లి చేసుకోవాలనుకున్నాం కదా. ఇలాంటివేంవద్దు,'' అతని చేతిని చేత్తో పట్టుకుంటూ అందామె.

''అంజలీ నువ్విలా బెంబేలు పడిపోతే ఎలా. అసలీ విషయాన్ని అంత భయంకరంగా తీసుకుంటావ్ ఎందుకు? సింపుల్‌గా ఆలోచించు. నువ్వో విషయం చెప్పు. మీ ఇంట్లోవాళ్లు నీకు పెళ్లి చేసే స్థితిలో వున్నారా? లేరు కదా. నీ విషయం తెల్సిన వాళ్లెవరైనా నిన్ను పెళ్లి చేసుకుంటారా? చేసుకోరు. కాని నాకు నువ్వంటే ఇష్టంరా. మనం మన బిజినెస్‌లో కాస్త నిలదొక్కుకున్నాం అనుకో. ఫైనాన్షియల్ ట్రబుల్స్ వుండవ్. చిన్నితల్లివి కదరా. లే లేరా. రెడీ అవ్వు,'' ఆప్యాయంగా ఆమె చేతిని చేతుల్లోకి తీసుకొని ముద్దు పెట్టి స్పూన్‌తో ఐస్‌క్రీమ్‌ని తినిపించాడు.

ఆ ముద్దు ఆమెలో నమ్మకాన్ని వెలిగించింది.

ఆమె డిన్నర్‌కి వెళ్లింది.

వారాలు, రోజులు గడిచిపోతున్నాయి.

''పెళ్లెప్పుడు చేసుకుందాం,'' అడిగింది అంజలి.

''చేసుకుందాం. తొందరేం వుంది. కాస్త బిజినెస్‌లో నిలదొక్కుకున్నాకనుకో, ఎంచక్కా హనీమూన్ ఎంజాయ్ చేయొచ్చు. స్విట్జర్లాండ్ వెళదాం. ఆ మంచు కొండల్లో నీతో రొమాన్స్,'' కొంటెగా నవ్వాడు.

''బిజినెస్‌లో నిలదొక్కుకోవడానికి యీ పెళ్లికి ఏం సంబంధం,'' నవ్వుతూనే అడిగింది.

''ఆడపిల్లలైనా, మగపిల్లలైనా కుంచించుకుపోయి వుండకూడదు. నువ్వంటే నాకు ఎందుకిష్టం అంటే చాలా ధైర్యంగా గోవా వరకు వెళ్లి పనిచేశావ్. ఎవరికి చేతనైనట్టు వాళ్లు పని చెయ్యాలి, సంపాదించాలి. ఎంజాయ్ చెయ్యాలి. సంపాదించే మార్గాలని వెతకాలి. అవకాశాలని సద్వినియోగం చేసుకోవాలి. మార్కెట్‌లో పెద్దపెద్ద కార్లు తిరుగుతుంటే మనం బస్‌పాస్ క్యూలో నిలబడటం తెలివితక్కువ. ఇన్నిన్ని లోన్స్ ఆఫర్ చేస్తుంటే కరెంట్ బిల్లులకి, కాయకూరలకి తడుముకోవడం దద్దమ్మల లక్షణం. ఇంత అందం వుంది. క్యాష్ ఇట్. పెళ్లి చేసుకొన్నాక నిన్ను కాలు నేల మీద పెట్టనివ్వను. మన పిల్లలు పబ్లిక్ స్కూల్స్‌లో చదువుకుంటారు. వాళ్లని రోజూ కారులో నువ్వో, డ్రైవరో డ్రాప్ చేసి రావచ్చు. మంచి కారు కొనిస్తా,'' అతను కారు లోన్‌కి అప్లై చేసి, ఆ విషయం ఆమెకు చెప్పకుండా కారు కలల్ని, వూహల్ని ఆమెకు ఇచ్చాడు.

అతను బయటికి వెళ్లమన్నప్పుడంతా వెళ్లనంటే అతనేమైనా అనుకుంటాడేమోననే సంశయం. అతనిపై కన్సర్న్ లేదనుకుంటాడేమో?!

*

ఆఫీసులో పంచ్‌కొట్టి అంజలి లోపలికి వస్తుంటే, ''సురేష్ ఒట్టి పిసినారి. మనల్నెవరిని పెళ్లికి పిలవలేదు చూడు,'' అంది నేహ.

అంజలి ఆగి, ''సురేష్ పెళ్లా... ఎప్పుడూ,'' ఆదుర్దాగా అడిగింది.

''మూడురోజులైందంట. రాత్రి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించాడు. హనీమూన్‌కి వెళుతున్నాడంట. బంధువులమ్మాయంట,'' నేహ చెబుతూనే వుంది.

తనెందుకు సరిగ్గా కనుక్కోలేకపోయింది! అతన్లో ఏం చూసి ప్రేమనుకుంది. తనలోని ఏ భయాలు

ఇష్టాలు తను చెప్పినట్టు ఆడించాయి. అతను తనని ప్రేమించలేదా? మరి ఆ వుద్వేగం వుల్లాసం ఏమిటి? వాటిని మించిన వుద్రిక్తత ఏమిటో? ఏదో ఎక్కడో తనకి అర్థం కావడం లేదు. ఎవరినో వొకర్ని పెళ్లి చేసేసుకోవాలని తనేం తపన పడలేదు. అతను తనూ ఇష్టపడ్డారు. పెళ్లి ప్రతిపాదన అతనిదే. ఎందుకింత మోసం? ఎందుకిలా జరిగింది? ఎవరు ఎవరి చేతిని ఎందుకు పట్టుకున్నారు? అతను తన అవసరాల కోసం తనచేతిని పట్టుకున్నాడా? తను కనిపించకపోతే అతను తనని వెతుక్కోవటమంతా నటనేనా? తన అవసరం ఏమిటి? ఎమోషనల్ కంపేనియన్ తన అవసరం. అంత గుంభనంగా ఎందుకతను పారిపోవాలి? గుంభనం కాదు దొంగ... ఆమె కళ్లల్లో తెరలు తెరలుగా జ్ఞాపకాలు జలజలా జారిపోతూ...

సురేష్ హనీమూన్ నుంచి తిరిగొచ్చిన వారం తర్వాత అంజలి అతని ఆఫీసుకి వెళ్లింది.

''నాకు డబ్బులు అవసరం. కాఫీషాప్ ఫ్రాంచీస్ తీసుకుందామనుకుంటున్నాను,'' అడిగింది.

''డబ్బులా... ఇప్పుడెక్కడున్నాయి,'' తేలిగ్గా అన్నాడు.

''నీ డబ్బులు కాదు. నావి. నువ్వు తీసుకున్నవి.''

''యిప్పుడు లేవురా... చాలా...'' అతని మాటలని ఆమె పూర్తి చెయ్యనివ్వలేదు.

''రెండు లక్షల వరకూ నీ దగ్గర వున్నాయి. ఎప్పుడిస్తావ్ చెప్పు,'' తిరిగి అడిగిందామె.

''యిప్పుడేం లేవ్ అంజలి. నాకు పనుంది. తర్వాత మాట్లాడదాం,'' అన్నాడతను.

''సురేష్ నీకు అర్జెంటంటే డెబ్బై వేలు వడ్డీకి తెచ్చాను, నా గోల్డ్ పెట్టి. నీకు తెలుసు కదా. వో వారంలోగా యిస్తావా?'' అడిగిందామె.

''చూద్దాం...'' పొడిపొడిగా జవాబిచ్చాడు.

ఆ చూద్దాం చూద్దాంగానే వుండిపోయింది. ఎంత ప్రయత్నించినా ఆమె తిరిగి ఆ డబ్బులు అతని నుండి తీసుకోలేకపోయింది.

''అతను ఇంక ఇవ్వడు. స్నేహంగానో, ప్రేమగానో ఇచ్చిన వాటికి పత్రాలేం వుంటాయ్. అవి మర్చిపోయి ఇక నుంచైనా కాస్త జాగ్రత్తగా వుండు. ముఖ్యంగా డబ్బుల విషయంలో ఎవరిని నమ్మకు. నే కాస్త ఎక్కువ ఇన్‌కం వచ్చే ఎసైన్‌మెంట్స్ చూస్తాను,'' వోదార్పుగా చెప్పింది నేహ.

''నేనింక ఈ పని మానేసి ఆ కాఫీ షాప్ ఫ్రాంచీస్ తీసుకుందాం అనుకున్నా. తిరిగి అదే పని. ప్చ్. ఎప్పటికి నాకో దారి వస్తుందో,'' దిగులుగా అంది అంజలి.

*

అమెరికా నుంచి వచ్చిన ప్రభుత్వాధికారులకి అన్ని సౌకర్యాలు సరిగ్గా అమరాయో లేదోనని రూమ్స్ లిస్ట్‌ని మాధురి చెక్ చేస్తుండగా నేహ నుంచి ఫోన్, ''అంజలి ఆత్మహత్య చేసుకోబోయింది. హాస్పిటల్లో వుంది,'' అని.

అంజలి ఆత్మహత్యా?!?!...

ఎందుకని... సురేష్ విషయమా... అతను వేరే పెళ్లి చేసేసుకొని అప్పుడే యేడాదిన్నర అయింది. ఇంకే విషయం...

మాధురి మేనేజర్ దగ్గరికి వెళ్లి పర్మిషన్ అడిగింది.

''ఎందుకు,'' అడిగాడతను.

''ఫ్రెండ్‌కి సీరియస్‌గా వుంది,'' అంజలి ప్రైవసీని గౌరవిస్తూ అంతే చెప్పింది.

''డ్యూటీ అయ్యాక వెళ్లొచ్చు కదా.''

''వెళ్లాలి.''

''పర్మిషన్ కష్టం.''

''లీవ్.''

''మీరిప్పుడు వెళ్లిపోతే ఎలా.''

''సాయంకాలం వరకు అక్కడికి వెళ్లకుండా పని చేయలేను,'' అందామె. మేనేజర్‌కి చికాకేసింది.

''చూడు మాధురీ. కెరీర్ తర్వాతే మిగిలిన విషయాలు. ఇంట్లో వాళ్లంటే అర్థం వుంది. మనకి మన జీవితంలో అనేకమంది పరిచయం అవుతారు. స్నేహితులుగా మారుతారు. మనకి తెలిసినవాళ్ల పరిధి పెద్దదిగా వుంటుంది. రోజూ ఎవరికో వొకరికి ఏదో వొక సమస్య వస్తుంటుంది. అందరినీ ఎక్కడ అటెండ్ కాగలం చెప్పు. టైమ్ పర్మిట్ చేయదు కదా. అవే ముఖ్యం అనుకుంటే ఇంట్లో కూర్చోవటం మంచిది. నీ ఏజ్ గ్రూప్ వాళ్లంతా కెరీర్ మీదే చూపంతా నిలుపుతారు. నువ్వేంటో ఇలా.... మొన్నటికి మొన్న మీ అత్తగారికి బాగులేదన్నావ్... ఆవిడని ఎంచక్కా హోమ్ ఫర్ ఏజ్డ్‌లో జాయిన్ చేయమంటే వినవ్. అసలు ను...''

''యిట్స్ వోకే... నే వెళుతున్నా,'' అని లీవ్, పర్మిషన్ కాగితాలు అక్కడ పెట్టేసి బయటికి వచ్చేసింది.

ఎమర్జన్సీ దగ్గర నేహ కనిపించింది.

''అంజలి ఇంటికి మెసేజ్ ఇచ్చా. వాళ్ల అన్నయ్య, అక్క వస్తున్నామని చెప్పారు. వాళ్ల అన్న ఫోన్‌లోనే కెయ్ కెయ్‌మంటున్నాడు,'' అంది నేహ. సాయంకాలానికి అంజలి అన్నయ్య అక్క వచ్చారు. అతని ముఖంలో బాధ ఆదుర్దా కోపాల సమ్మేళనం. అక్క వెక్కెక్కి ఏడ్చేసింది.

''ఏంకాదు కదా...'' వెక్కిళ్ల మధ్య మాటలు.

నేహ పోలీసులతో మాట్లాడింది కేస్ కాకుండా.

"ఎందుకిలా చేసింది," అంజలి అన్నయ్య అడిగాడు.

ఆ ప్రశ్నకి ఎవ్వరి దగ్గరా జవాబు లేదు. వారివారి మనసుల్లో వాళ్లవాళ్లకి తోచిన కారణాలున్నాయ్.

అంజలి అక్క, అన్నయ్య ఎమర్జన్సీ దగ్గర కూర్చున్నారు. మాధురి, నేహ లాంజ్‌లోని కాఫీ షాప్‌కి వచ్చారు. కాఫీ తాగుతూ నేహ, "తాజ్ చూస్తామన్నారు వాళ్లు. అంజలితో పంపించా. అటు నుంచి వచ్చి ఆఫీసుకి కూడా రాలేదింకా. ఇలా ఎందుకు చేసిందో..." అంది.

"సురేష్ విషయంలో కూడా తట్టుకొని నిలబడింది. ఏమై వుంటుందో," అంది మాధురి.

"వూ.... వాడొకడూ... ప్చ్... మధూ.... మీరంతా ఇంత ఫూలిష్‌గా మగవాళ్లని ఎలా నమ్ముతారో?! ఎక్కడో వొకరుంటారు సెన్సిబుల్‌గా. కాస్త స్వేచ్ఛగా సొంతగా బతికే అమ్మాయిలపై యీ మగవాళ్లకేం గౌరవం, ప్రేమా వుండవ్. ఉన్నట్టు నటించి మనలని వాళ్ల కెరీర్ కోసం, సరదాల కోసం వాడుకుంటారు. పైకి మాత్రం మనలని నమ్మించడానికి వో ముసుగు వేసుకుంటారు. అంతే," ఖాళీ అయిన ప్లాస్టిక్ కప్‌ని నలిపేస్తూ అంది నేహ.

అంజలిని ఎమర్జన్సీ నుంచి రూంలోకి షిఫ్ట్ చేశారు. అంజలి దగ్గర వాళ్ల అక్క వుంటుంది. అన్నయ్య పనుందని వూరెళ్లిపోయాడు. నేహా, మాధురీ వుదయం సాయంకాలం వచ్చి చూసి వెళుతున్నారు.

అంజలి చూపులు టీవి స్క్రీన్‌పై వున్నాయి. కానీ అవి ఏవీ ఆమెకి రిజిస్టర్ కావటం లేదు.

"మాధురి ఇంకా రాలేందేంటి," అప్పటికి మూడోసారి అడుగుతోన్న అక్కవైపు స్పష్టంగా చూస్తూ, "ఎందుకు బయటకేమైనా వెళ్లాలా," అడిగింది.

"ఆఁ యీరోజు గురువారం. గుడికి వెళ్లాలి. యీ హాస్పిటల్లో ఆంజనేయస్వామి, వినాయకుని గుడి వున్నాయంట. సాయిబాబా గుడి దగ్గర్లో వుందేమో కనుక్కుందామని," అందామె.

"హాయ్," అంటూ మాధురి లోపలికి వచ్చింది. వెనకే కౌశిక్.

"గుడికి వెళ్లాలి..." అక్క ఆత్రంగా అడిగింది.

"సాయిబాబా గుడికా... కౌశిక్‌తో వెళతారా? దగ్గర్లో లేదు. మీరొక్కరూ వెళ్లలేరేమో," అంది మాధురి.

వాళ్లిద్దరూ వెళ్లాక మాధురి ఆ మాటా యీ మాటా చెపుతూ అంజలితో మాట్లాడించటానికి ప్రయత్నించింది. సినిమాలు, పాటలు, చీరలూ వూహూఁ.... అంజలి చూపులు ఎక్కడెక్కడో తిరుగుతూ.

"నన్నెందుకు సేవ్ చేశారు," చప్పున అడిగింది.

మాధురి చూపుల్లో మౌనం.

"చెప్పు," పెంకిగా తిరిగి అడిగింది అంజలి.

"నీకు సంతోషంగా లేదా."

"యేంటి."

"బతికినందుకు."

"యిందులో సంతోషం వుంటుందా?"

"మన ప్రాణం కంటే విలువైనది యీ ప్రపంచంలో ఏమైనా వుందా," మాధురి అడిగింది.

"ప్రేమ... ప్రాణం కంటే గొప్పదనుకున్నా," అందామె.

"ముందు నువ్వు మనిషి పై నమ్మకాన్ని పెంచుకో."

"ఆ నమ్మకం బద్దలయ్యే కదా."

"వ్యక్తులపై కాదు. ప్రేమపై విశ్వాసాన్ని నింపుకో. మనపై మనకి ప్రేమ, గౌరవం... చుట్టూ పరిస్థితులకి అందరం బందీలమే. అలా ప్రవర్తించడానికి సురేష్‌కి వుండే లాజిక్ సురేష్‌కి వుంటుంది. నేహాకి వుండే సమర్థన నేహాకి వుంటుంది. వ్యక్తులు కుమ్మరించే ప్రేమ మోసాలబట్టే మన ఆనంద విషాదాలని నిర్ణయించే శక్తి వాళ్లకి ఇచ్చేస్తే మనం రోజూ ఛస్తూ బతుకుతూ వుంటాం..."

"కౌశిక్ దొరకటం వల్ల నీకీ నిబ్బరం వచ్చిందా," అడిగింది అంజలి.

"కౌశిక్‌తో పరిచయానికి ముందు నేనూ కిందామీద అవ్వటం జరిగింది. ఇన్ఫర్మేషన్ బ్యూరోలో పనికొస్తానని వొకరు. ప్రేమని నటిస్తే ఎటియంలా పనికొస్తానని వొకరూ ఇలా ఎవరి పరిధిలో వాళ్లు ప్రవర్తించారు. నాకూ మనుషులు కావాలి. ఎమోషనల్ స్నేహం కావాలి. ఆ వెతుకులాటలో అలా మేం వొకరిని వొకరం నింపుకున్నాం. తోడు కొంత నిబ్బరాన్ని ఇస్తుంది. కానీ పూర్తిగా కాదు. ఏదైనా మనలోంచే రావాలి. ఏ ఎమోషన్స్‌కైనా అంచనాలు తలకిందులైనప్పుడు గాయాలు అవుతాయి. మోసుకు తిరుగుతాం. బట్... ఇలా అయితే ఎలా..."

అంజలి ఫకాలున నవ్వింది.

"ప్రేమించే మగవాళ్లుంటారు. బాధ పెట్టేవాళ్లూ వుంటారు. ఎన్నిరకాలుగా వాళ్లు హింసించగలరో మనకి చాలా చాలా బాగా తెలుసు. వాళ్ల మోసాలకి హింసకి తట్టుకోలేక ఆత్మహత్యలే చేసుకోవటం మొదలుపెడితే మన స్త్రీల జనాభా చాలాచాలా తక్కువుండేది కాదా... స్మశానాలలో చోటే వుండదు. ఎవరి ఇంటి ముందో వెనకో తగలపెట్టుకోవల్సిందే," అంది అంజలి బిట్టర్‌గా నవ్వుతూ.

''మరెందుకిలా,'' అడిగింది మాధురి.

అంజలి వెక్కెక్కి ఏడ్చింది. బిగ్గరగా అరుస్తూ ఏడ్చింది. నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది. మౌనంగా వుండి పోయింది. దేహమంతా రోదిస్తుంటే, ''ఎయిడ్స్,'' అని చెప్పింది.

ప్రాణం పగిలింది.

*

...''యేరా నిద్రరావటం లేదా...'' కౌశిక్ ఆమె బుగ్గలపై జోకొడుతూ నిద్ర మెలకువలో అడిగాడు.

తడితడిగా బుగ్గలు.

''తల్లీ... బజ్జో...'' లాలనగా అన్నాడు తడి తుడుస్తూ.

''ప్రాణాలకి ముప్పు అని తెల్సి కూడా ఇలా ఎలా ప్రవర్తిస్తున్నారు,'' అడిగిందామె.

''యెవరు,'' నిద్రలోంచి పూర్తిగా బయటికి వస్తూ అడిగాడు.

''వాళ్లే... చాలామంది. అందరికీ తెలుసు. రోడ్డు పక్కనున్న సోనాగచ్చి... కామాటిపుర అన్నీ తెలుసు. సెక్స్ పెద్ద బిజినెస్. చాలా వ్యాపారాలకి సెక్స్ చాలా ముఖ్యం. వాళ్లకీ ఆకర్షణలన్నీ తెలుసు. అందమైన ప్రదేశాలు చూడండనే బోర్డులున్న చోట ఎయిడ్స్ సంబంధించిన బోర్డులు పెట్టనివ్వరు. ఇప్పుడు ఇది చాప కింద నీరులానూ లేదు. కార్పెట్ కింద దుమ్ము లానూ లేదు. రిజర్వాయిర్... క్లాస్ క్యాస్ట్ జండర్... లాభం లేదు ఎవరి ప్రాణాలు, జీవనం ఎవరి చేతు ల్లోనూ లేవ్. ఆరోజు అంజలి విషయం తెల్సినప్పుడు ఎంత భయం వేసింది. నాలోనూ ఆ వైరస్ వుందేమో నని. టెస్ట్ చేయించుకోడానికి రిపోర్ట్ చూడ్డానికి మధ్య ప్రాణమెంత గిలగిలలాడింది. వైరస్ లేదని తెలిసి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. వొక్కళ్ల నేంటి... ఇదో చెయిన్. నెవర్ ఎండింగ్ చెయిన్. తెలిసి తెలిసి ఇన్నేసి ప్రలోభా లని అందరిపై వాళ్లు ఎందుకు కుమ్మరిస్తున్నారు. ఎవర్ని ఎవరు రక్షిస్తారు,'' ఆమె కళ్ల నిండా నీళ్లు.

అప్పుడప్పుడూ మాధురి అలా డిస్టర్బ్ అవ్వటం అతనికి అనుభవమే.

''మధూ.. వర్రీ కాకురా. మనం బానే వున్నాం కదా. ఎందుకలా దిగులుపడతావ్. మన పిల్లల్ని మనం కేర్‌ఫుల్‌గా... బై ఆల్ మీన్స్ పెంచుదాం. అయినా ఎయిడ్స్ వస్తే ఎందుకంత కంగారు. చాలావాటికి మందులులేవ్ యీ ప్రపంచంలో. వున్నా అందరికి అందుబాటులో లేవ్. హెచ్.ఐ.వి. వైరస్ వుందనుకో ఏమవుతుంది. ఇమ్యూన్ సిస్టమ్ కేర్ తీసుకుంటే కోపప్ అవుతారు కదా. చాలుకదా. వెంటనే ప్రాణాలకేం కాదు కదా... బోల్డన్ని ఏళ్లు మామూలుగానే వుండొచ్చు. పడుకో...'' కళ్లనీళ్లతో తడిసిన ముంగుర్లను మెల్లగా వెనక్కి నిమురుతూ ఆమె చేతివేళ్లని తన చేతివేళ్లలోకి తీసుకొని ఆ చేతిని తన గుండెల్లో దాచుకుంటూ మెల్లగా నిద్రపోయాడు కౌశిక్.

ఆమెకి నిద్రపట్టడంలేదు.

అంతేనా... యిలానే వుంటుందా జీవనం. ఎవరి పిల్లల్ని ఎవరు జాగ్రత్తగా పెంచటంలేదు. అందరూ పెంచుతూనే వున్నారు. మనం బాగున్నామా? మన చుట్టూ లోకం తగలడిపోతుంటే మనకి ఆ సెగ అంటదా...

నిద్రలోంచి డాలీ ఏడుపు వినిపిస్తోంది. పాపని ఎత్తుకొని వంటగదిలోకి వెళ్లి పాలు వెచ్చబెట్టి పాపకి పట్టించి లాలి నిద్రపుచ్చి వచ్చి మంచంపై వాల్తూ కౌశిక్ వైపు చూసింది. మత్తు నిద్ర. అమాయక నిద్ర. అతని నుదిటి చివర్న ముద్దు పెడుతూ పక్కపై వాల్తూ ఏం చెయ్యాలి... చెయ్యాలి... ఈ సమస్యాన్ని ఏం చెయ్యాలి... ఏం చెయ్యలేమా... చెయ్యాలి... ఘర్షణా... కను చూపుల్ని అప్రయత్నంగా కమ్ముకుంటున్న కలత నిద్ర... రవ్వంత వుదయపు వెలుగులో ఆమెకి మెలకువ వచ్చీ రాగానే ఏదో తెలియని బెంగ శరీరమంతా వొత్తుగా చుట్టుకొంది.

ఆమె మళ్లీ మంచం మీద అనీజీగా గోడవైపుకి తిరిగి పడుకునేంతలోగా చిట్టి మెత్తని చెయ్యి ఆమెపై. మాధురీ తలతిప్పి చూసింది. డాలీ తుళ్లింతగా నవ్వుతూ బయటికి లాక్కుపోయింది. బాల్కనీ నిండా వాన. వడగళ్ల వాన. నిండిపోయిన నీళ్లు... కిందంతా పిల్లల కేరింతలు. గొడుగులు విసిరేసి పుస్తకాలు పారేసి అరుపులే అరుపులు... సందడి. అమ్మలు నాన్నలు అమ్మమ్మలు... వొక్కొక్కరే తడిసి ముద్దవుతూ... పడవ... పడవ... డాలీ న్యూస్‌పేపర్‌తో... పర్ పర్ పర్... వార్తలు ముక్కలు ముక్కలుగా... ఏ పడవ... కత్తి పడవ... పూల పడవ... తెరచాప పడవ ...సారంగి పడవలు... కాగితప్ప డవలు... మాధురి పడవలిస్తోంది... పిల్లల కేరింతల్లో తనూ కేరింతై వడగళ్లని దోసిలి నిండా నింపుకొంటూ విసురుతూ వదిలేస్తూ...

*ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య ప్రత్యేక సంచిక, మార్చి 2001*